

తోటినేని వెంకట నరసింహారావు

# పరువు

నేను గవర్నమెంటు ఉద్యోగంకోసం తపస్సుచేసి, చచ్చీచెడి ఒక పెద్ద సైజు బడిపంతుల్ని కాగలిగాను. మా జగపతి 'ద హెల్ విత్ ద గవర్నమెంట్' అన్నాడు. అని ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ ముకుందంగారి పర్సనల్ సెక్రెట్రీగా చేరాడు. అప్పటి వరకూ వాడి చొరవని తక్కువ అంచనా కడుతున్న నేను వాడి ధైర్యాన్ని మనసారా అభినందించలేకుండా వుండలేకపోయాను. మూడవ తరగతి యం. ఏ. గాడయితేనేం? ఎయిర్ కండిషన్డ్ ఆఫీసు, ముకుందంగారి ఖర్చుతో చిన్న సైజు బంగళా, పెట్రోలుతోసహా కారు. నెలకు పన్నెండు వందల జీతం. ఒత్తి కర్రపెత్తనం ఉద్యోగం. ముకుందంగారి బిజినెస్–కం–పర్సనల్ వ్యవహారాలు నేర్పుగా చేసుకుపోవటమే వాడి ఉద్యోగం. వాడి అదృష్టానికి నేను అసూయపడకండా వుండలేకపోయాను.

జగపతీ నేనూ ఒకే కంచంలో తిని ఒకే మంచంలో దొర్లాము. మా ఇద్దరి మధ్యా ఎలాంటి దాపరికాలూలేవు. నేను విశాఖపట్నం. వెడితే పెళ్లాంపిల్లల్ని మరచిపోతానని మా ఆవిడా, వాడు విజయవాడ వచ్చినా అంతేనని వాడి భార్యా కలిసికట్టుగా వాపోవడం మా ఇద్దరికీ తెలుసు.

యూనివర్సిటీలో ఏదో పనిమీద వచ్చి జగపతిఇంట్లో దిగాను రెండు.

రోజుల్లో నా పని పూర్తయినా వీడు వదలందే! కదిలితే తంతానన్నాడు వైజాగ్ ఇన్ దనయిట్ చూపెడతాట్ట. ఏ లండనో, ప్యారిస్సో చూపెడతానన్నంత ఉత్సాహంతో.

జగపతి ఆఫీసురూములో ఎదురుబొదురుగా కూర్చున్నాం. వాడి దర్జా చూసి అసూయపడటం స్నేహధర్మం కాదేమోనని తర్కించుకుంటున్న సమయంలో

"నువ్వు దయ్యాల్ని నమ్ముతావా ?" బాంబులాంటి ప్రశ్న వేశాడు. అదిరిపడ్డాను.

"నమ్మను..."అన్నాను.

"ఎందుకు నమ్మవు ?" మళ్ళీ ప్రశ్న.

"నీ పిండాకూడులా వుంది ప్రశ్న. నా ఇష్టం. నే న్నమ్మను" అన్నాను మొండిగా.

"పోనీ దేవుడున్నాడంటావా ?"

"సరే! వున్నాడనుకుందాం. వుంటే ?..."

"దేవుడున్నప్పుడు దయ్యాలెందుకుండవోయ్ ?"

వీడి రీజన్ మండినట్లుగావుంది.

"తోటకూరవుంటే బచ్చలకూర వుండాలని ఎక్కడుందోయ్ ?" అన్నాను.

"ఉరే! మొండివాదం చెయ్యకు..." అనినావంక కోపంగా చూశాడు జగపతి.

"అసలు సంగతేమిట్రా ?" అన్నాను.

"ఇదివర్లో నీకంటే ఎక్కువ మొండిగానే వాదించేవాణ్ణి కాని నా కంటితో చూశాను..."

"ఏమిటి చూసింది ?..." రెట్టించాను.

"దయ్యాన్ని..."

'వీడికేం పోయేకాలం చెప్మా' ? అనిపించింది. మళ్ళీ అదే ప్రసక్తి ? అయినా వాదం పెంచాలనిపించింది నాకు.

"అసలు నువ్వు చూసింది దయ్యం అని దాఖలా వుందా ?"

"ష్యూర్..."

"నేను నమ్మను. నువ్వే మనిషినో చూసి దయ్యం అనుకుని వుంటావు" అన్నాను సాగదియ్యాలని. అసలు దయ్యాలమీదా, భూతాలమీదా, ఆ మాట కొస్తే దేవుళ్ళమీదా, నాకో ఖచ్చితమైన అభిప్రాయమంటూ లేదు. కేవలం వాదం కోసమే అలా అన్నాను.

"మైగాడ్ ! దయ్యానికీ మనిషికీ తేడా తెలియనంత మూర్ఖుణ్ణను కున్నావా ?"

"నేను మూర్ఖుణ్ణే ! ఆ తేడా ఏమిటో నాకు తెలీదు. నువ్వు చెప్పు. నేను వినడానికి సిద్ధం..." అన్నాను. జగపతి మరీ రెచ్చిపోయాడు. చేతిలో వున్న పేపర్‌వెయిట్ నా ముఖానకొట్టి సోరీ అంటాడేమోనన్నంత భయంవేసింది.

టెలిఫోన్ మోగింది. జగపతి రిసీ

వర్ ఎత్తి మాట్లాడాడు. అవతలి గొంతు స్పష్టంగా వినిపించడంలేదు. జగపతి మాత్రం...

"యస్ సర్..."

"యస్. సార్..."

"ఓకే! సార్..." అని రిసీవర్ పెట్టేశాడు.

"కూర్చో. ఇప్పుడే వస్తాను. బాస్ పిలిచారు" అని ఏవో కాగితాలు పేడ్‌లో పెట్టి తీసుకెళ్ళాడు. పదినిముషాల తరువాత తొచ్చాడు.

"బాస్ ఎల్లుండి అమెరికా వెడుతున్నారు. ఏర్పాట్లన్నీ పూర్తికావాలి" అన్నాడు జగపతి.

వాడి "బాస్" అమెరికావెడితే నాకేం? ఆఫ్రికావెడితే నాకేం? నాకాసక్తిగావున్న జగపతి అర్ధంతరంగా ఆపేసిన దయ్యం సంగతి గుర్తుచేశాను.

"అవునవును. దయ్యాలు లేవని గదూ నీ అభిప్రాయం..."

"అవును"

"పోనీ నీకు చూపిస్తాను. నమ్ముతావా?"

"చూపించు. అప్పుడు చూద్దాం"

"పందెం?"

"ఎంత?"

"సన్ ఎన్ సీలో పార్టీ ఖర్చు..."

"ఓ...కే...!"

"అయితే రాత్రి పదిగంటలకు మనం ఇక్కడకు రావలసి వుంటుంది. ఎందుకని అడక్కు. దయ్యాన్ని చూడ్డానికి..."


"నీ ఉద్దేశ్యం? ఈ బంగళాలోనే దెయ్యంవుందనా?"

'అదంతా నీ కనవసరం. నేను చెప్పినట్లు చెయ్యి..."

"సరే"

జగపతి తన బాస్ వివరాలు చెప్పాడు. చెప్పడంలో కూడా ఒక మంచి యజమానిమీద ఒక మంచినౌకరు చెప్పేవిధంకన్నా ఎక్కువగా చెప్పాడు. ఎంతో డివోటెడ్‌గా చెప్పాడు.

శ్రీ ముకుందం ఆంధ్రదేశంలో ఒక పేద్ద బిజినెస్ మేగ్నెట్ (ట). ఆయన స్వంతాన నాలుగు పంచదార మిల్లులూ, రెండు సిమెంటు ఫ్యాక్టరీలూ, ఎన్నో ప్రయివేటు బ్యాంకుల్లో షేర్లూ, ఇంకా ఎన్నో పబ్లిక్ సంస్థలతో సంబంధం(ట). సంవత్సరంలో ఏడెనిమిది నెలలు విదేశాల్లోనే గడుపుతాడు(ట). ఇవ్వాళ లండన్, రేపు ప్యారిస్, ఎల్లుండి జినీవా, ఆ మరసటిరోజు కోపెన్‌హాగన్ (ట). మధ్య మధ్యన స్వదేశం వచ్చి బిజినెస్ వ్యవహారాలు అలా...అలా... చూసుకుని వెళ్లిపోతూవుంటారు (ట). ప్రధాన మంత్రయినా ఫారిన్ ఎక్స్ఛేంజికి తడుముకోవలసి వస్తుందేమోగాని శ్రీ ముకుందంగారికి మాత్రం అలాంటి ఇబ్బంది వుండదని పెద్ద సర్కిల్స్‌లో జోక్‌గా అనుకోవడం మామూలు (ట).




అందుకే ఆయన వ్యవహారాలు చూసుకునేందుకు నమ్మకమైన ఒక పర్సనల్ సెక్రెటరీ కావాల్సి వచ్చింది (ట). ఆయనకు కావలసిన మనిషి జగపతిలో దొరికాడు(ట). నిజమే ననిపించింది. జగపతి సమర్థతా, చొరవా, స్వామి భక్తీ నాకు తెలియనివి గావు.

నిజానికి ఈ వివరాలు నాలో ఏమాత్రం ఆసక్తిని కలిగించలేదు. అయినా జగపతి అంత 'ఇది'గా చెబుతున్నపుడు చిన్నబుచ్చడం ఇష్టంలేక ఊరుకున్నాను. మరికొన్ని వివరాలు చెప్పాడు.

ముకుందంగారు ఖచ్చితమైన నియమాలు గలవాడు (ట). ఒఖ్ఖ డ్రింక్ విషయంలో తప్ప ఆయనలో వేలెత్తి చూడడానికి ఏ బలహీనతా లేదు (ట) క్రమశిక్షణతో పిల్లలు ముగ్గుర్నీ పైకి తీసుకొచ్చారు (ట). ఒక్కొక్కరూ రెండేసి ఫ్యాక్టరీల అజమాయిషీ చేస్తున్నా ఇప్పటికి తండ్రెదుట పడి మాట్లాడరు (ట) వగైరా... వగైరా...

* * *

రాత్రి భోజనాలు ముగించుకుని ముకుందంగారి బంగళా చేరుకున్నాము. కారు పోర్టికోలో ఆగింది. యూనిఫారమ్‌లో వున్న నౌకరు డోర్ తెరిచాడు.

"దొరగారు పడుకున్నారా?" అడిగాడు జగపతి.

లేదుసార్! ఇంకా ఏవో కాగితాలు చూసుకుంటున్నారు" జగపతి ఆఫీసు రూములోకి నడిచాము. నాలుగు ఇన్‌కంటేక్స్ ఫైళ్లను ముందేసుకున్నాడు జగపతి.

"నేను చెయ్యగూడని పనొకటి చేస్తున్నా(నా..." అన్నాడు జగపతి మెల్లగా నన్నుద్దేశించి.

"ఏమిటది?"

"మనం దేనిగురించి ప్రస్తుతం ఇక్కడున్నామో ఆ విషయం ఇప్పుడు నీకు చెబుతున్నాను. అతి రహస్యమైన ఈ విషయాన్ని బయటివాళ్లెవరికీ తెలియకుండా కట్టుదిట్టం చేశాను. ఈ విషయాన్ని ఎక్కడా చెప్పనని ప్రమాణం చెయ్యి..." అన్నాడు. ఇప్పటివరకూ నేను జగపతి మాటలు సీరియస్‌గా తీసుకోలేదు. దయ్యాన్ని చూపిస్తానని పందెంవేసినప్పుడుకూడా తమాషాక్రిందే తీసుకున్నాను. ఇప్పుడు వాడి సీరియస్‌నెస్ చూస్తుంటే నిజంగా దయ్యాన్ని చూపెట్టడానికి సిద్ధంగా వున్నట్లుగా వున్నాడు.

ప్రమాణం చేశాను

గడియారం పదకొండు కొట్టింది జగపతి ఆఫీసుగది మినహా బంగళా అంతా నిద్రలో మునిగిపోయింది. గేటు దగ్గర గూర్ఖా నిద్రమత్తు వొదిలించుకోడానికి గాబోలు అప్పుడప్పుడూ అర్థంలేకుండా అరుస్తున్నాడు. ఔట్ హవుస్లో కూడా సందడి చచ్చిపోయింది.

పన్నెండు కొట్టింది.

"పద..." అంటూ జగపతి మెట్లవైపుకు దారితీశాడు. మెట్లమీదయూఫోమ్ తివాచీ మెత్తగావుంది. పొడుగాటి కారిడార్‌గుండా వెళ్లి కుడివైపుకు తిరిగాము. జగపతి ఒక కిటికీదగ్గర ఆగిపోయాడు. వాతావరణం చలిగా వున్నా ముఖం చెమటలు కక్కుతోంది. ముఖంలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. "చూడు..." అని సైగచేశాడు.

కిటికీగుండా చూశాను. విశాలమైన ధనవంతుల బెడ్‌రూం. సినిమాహాలంత వుంది సినిమాల్లో చూపించినంత హుందాగావుంది. సోఫాలో ముకుందంగారు కూర్చున్నారు. ఆయన వీపు మాకు కనిపిస్తోంది. పక్కకు తిరిగినప్పుడు మాత్రం గుప్పుగుప్పుమంటూ పైపు కనిపిస్తోంది కొంచెం దూరంలో టీపాయ్ మీద ఒక బాటిల్ వేట్-69 - సగం నిండుగావున్న గ్లాసు

ముకుందంగారు తాపీగా పానీయం పుచ్చుకుంటున్నారు బెడ్‌రూం లైటు డిమ్‌గా వెలుగుతోంది నా దృష్టి విశాలమైన మంచాలమీద పడింది. మంచంమీద ఒక స్త్రీ కనిపించింది. గతుక్కుమని రెండడుగులు వెనక్కి వేశాను. మరొకరి బెడ్‌రూములోకి తొంగిచూడవలసిన చవకబారు స్థితికి దిగజారినందుకు నా మీద నాకే జుగుప్స కలిగింది. జగపతి మీద కోపమొచ్చింది.

జగపతి నాచెయ్యిపట్టుకుని గుంజాడు. మళ్లీ చూశాను. ముకుందంగారు అడ్డుండటంవల్ల ఆమె ముఖం కనిపించడంలేదు. గుడ్డి వెలుతురులో కూడా ఆమె శరీరం పచ్చగా బంగారం రంగులో కనిపించింది. అవయవాలన్నీ పొందికగా వున్నవి. యవ్వనంలో పిటపిట

లాడుతున్నట్లు ఆమె శరీరం బిగువు చెబుతోంది. చిన్న బాతింగ్ అండర్ వేర్ మినహా దాదాపు నగ్నంగావుంది.

ముకుందంగారు లేచి నిలబడ్డారు. ముఖమల్ నైట్ గౌనలో అచ్చం సినిమాల్లో జమీందారులా వున్నారు. కొంచెం సేపు ఆమె అందాన్నంతా కళ్లతోనే అనుభవించారు మంచంమీద కూర్చున్నారు. [illegible]గా వొళ్లంతా నిమిరారు. నడుంచుట్టూ చెయ్యివేశారు. ముద్దుపెట్టుకున్నారు. మెల్లగా ఆమె పక్కన చోటుచేసుకున్నారు

గ[illegible]న్న సభ్యత గుర్తొచ్చింది. అప్పటిదాకా చూసింది సభ్యతయినట్టూ తరువాత చూడబోయేది నిస్సందేహంగా అసభ్యత అయినట్టూ అనిపించింది

పదమన్నట్టు సైగచేశాను. దొంగల్లా క్రిందకుదిగి జగపతి రూములో దూరిపోయాం.

జగపతి ఫ్రిజ్ తెరచి రెండుగ్లాసులు టేబుల్‌మీదపెట్టాడు. ఒక్కొక్క పెగ్ చొప్పున రెండు గ్లాసుల్లోనూ విస్కీ వేసి సోడానింపాడు.

"తీసుకో..." అంటూ అందించాడు. మాట్లాడకుండా తీసుకుని ఒక్కగుక్కలో త్రాగేశాను.

"ఇప్పుడేమంటావ్ ?" అన్నాడు నా వంక కొంటెగా చూసి. నాకు కొంచెం సత్తువొచ్చినట్లనిపించింది. శరీరం కొంచెం వేడెక్కింది.

"నువ్వింత భ్రష్టుడవని ఇప్పుడే తెలుసుకున్నాను" అన్నాను.

"ఉద్రేకపడకు. నీ బాధ నాకర్థమయింది. ఆమె ముకుందంగారి భార్య మాత్రంకాదు. ఆమె పోయి పది సంవత్సరాలయింది" అన్నాడు సమర్థింపుగా.

"ఆమెకాకపోతే మరో స్త్రీ మనం అలాచూస్తుంటే బార్బరస్..." అన్నాను కోపంగా.

"అక్కడే పొరబడ్డావు. మరో స్త్రీ ఈ గదిలోకి ప్రవేశించే అవకాశంలేదు." వాడు చెప్పింది నమ్మడానికి నేను సిద్ధంగాలేను.

"అయితే ఎవరంటావ్ ?" అన్నాడు.

"దయ్యం..." అన్నాడు జగపతి. నాకు కొంచెం భయంలాంటి అనుభూతి కలిగినా ఇంకా నమ్మబుద్ధి కావడంలేదు. దయ్యానికి మనిషికి భేదం ఏమిటో నాకు సరిగా తెలియదుగాని ఆమె నూటికి నూరుపాళ్లూ మనిషి. సందేహం లేదు. దయ్యం అనుకోవడం ఎలా ? అసాధ్యం ఆ మాటే అన్నాను.

"ఋజువు కావాలా ? తలుపులన్నీ వేసినవి వేసినట్లే వుంటవి. మరో గంట పోయాక చూస్తే ఆమె అక్కడ కనిపించదు..." అన్నాడు.

"సరే ! మరోగంట పోయాక చూద్దాం," అన్నాను మొండిగా, ఏమన

డానికీ తోచక. జగపతి మరికొన్ని వివరాలు చెప్పాడు

'ముకుందంగారు శ్రీరామచంద్ర మూర్తి అంతటి సద్గుణసంపన్నుడు ఇప్పటికీ ప్రొద్దుటే లేచి భార్య ఫోటో ముందు రెండు నిముషాలు మౌనంగా గడిపిగాని మరో పని ముట్టడు ఆమె పేరు పెడతానంటే చాలు ఇప్పటికీ ఎంతయినా ధర్మం చెయ్యడానికి వెనుదీయడు. అసలు స్వతహాగా ఆయన దానకర్ణుడు. అష్టయిశ్వర్యాలూ వున్నా వృద్ధాప్యంలో వొంటరివాడు

ఒంటరివాడు గనుకనే స్త్రీ వ్యామోహం అంటగట్టే ప్రమాదంవుంది. కాని ఆయన నిఖార్సయిన మనిషి. నిష్ఠగల మనిషి. ఈ వయసులో మరో స్త్రీని తీసుకొచ్చి పెట్టుకోవడం అనూహ్యం. ఒకవేళ వాదంకోసం అలాంటి దౌర్బల్యానికి పాల్పడ్డాడని అనుకున్నా ఇలా దొంగచాటు వ్యవహారం చెయ్యవలసిన అవుసరం ఆయనకు లేదు. ఏ లేడీ సెక్రెటరీ రూపంలోనో పబ్లిగ్గా పెట్టుకుని వుండొచ్చు- నిజానికి ఇలాంటి ప్రసక్తి ఒక పార్టీలో వచ్చింది అప్పుడు ముకుందంగా రేమన్నారో తెలుసా ? మైగాడ్! లేడీస్ ఆర్ సింప్లీ న్యూసెన్స్" అన్నారు. అందుకే ముకుందంగారి కిలాంటి వ్యామోహాలు అంటగట్టే అవకాశం లేదు" అని ముగించాడు జగపతి.


ఈ రీజనింగ్ నాకు నచ్చలేదు. పైన చెప్పిన క్వాలిఫికేషన్లున్నంత మాత్రాన వ్యామోహానికి అతీతుడు కాగలడని నాకు నమ్మకం కుదరలేదు. విశ్వామిత్రుడంతటివాడు స్త్రీముందు పల్టీ కొట్టాడు ఆ మాటే అనేశాను.

"సరే ! అలా అనుకోవడానికీ వీలు లేదు బంగళా చుట్టూ కాపలా. ఇంట్లో పదిమంది నౌకర్లు. ఇంతమంది కళ్లు కప్పి ఒక స్త్రీ ఆయన బెడ్‌రూములోకి ప్రవేశించే అవకాశం లేదు. అందుకే అది దయ్యమని ఖచ్చితంగా చెబుతున్నాను. నేననుకోవడమేకాదు ఇక్కడ మా స్టాఫంతా కూడా ఇదే మాట..." ముకుందంగారు దయ్యంతో కాపురంచేస్తున్నారని వాళ్ల నమ్మకం. అందుకే వాళ్లెవరూ తమకు తాముగా ఆ గదిఛాయలకు వెళ్లరు..." అని ఆపాడు జగపతి.

జగపతి మళ్లీ వివరించి చెప్పాడు.

"ఈ మధ్య సర్వెంట్స్‌లో ఒక కొత్తవిషయం ప్రచారంలో కొచ్చింది. ముకుందంగారు చదువుకునే రోజుల్లో ఒక అందమైన యువతిని ప్రేమించారనీ, ఇద్దరూ పెళ్లిచేసుకుని హాయిగా వుందామనుకునే సమయంలో పెద్దలు అంగీకరించలేదనీ, తత్ఫలితంగా ఆమె ఆత్మహత్య చేసుకుందనీ, ఆమె పిశాచమై ఈ రకంగా ముకుందంగారితో సంసారం చేస్తోందనీ వగైరా... వగైరా..."

"నిజానిజాలు ముకుందంగారికి




తెలుసు. భగవంతుడికి తెలుసు. మూడో కంటికి తెలియదు" అని ముగించాడు జగపతి. గడియారం ఒకటి కొట్టింది.

మళ్లీ ఒకసారి బెడ్‌రూము వైపుకు వెళ్లాము. ఈసారి నాకు నిజంగా భయంవేసింది. బింకంగా జగపతి వెంట వెడుతున్నా అడుగులు పడటం కష్టమయి పోయింది.

కిటికీగుండా మళ్లీ చూశాము. మంచాలమీద ముకుందంగారొక్కరే గాఢమైన నిద్రలో వున్నారు.

వెనక్కి తిరిగాము. నా బుర్ర వేడెక్కి పోయింది. ఇంత స్పష్టంగా చూశాక నమ్మకపోవడం మొండితనం అవుతుంది గాని ఏ తర్కానికి నిలువదు. అందుకే నేను పందెంలో ఓడిపోయానని అంగీకరించాను.

మర్నాడు నన్ను జగపతి సన్-ఎన్-సీ హోటలుకు తీసుకెళ్లి నూటపాతిక రూపాయలు ఖర్చుపెట్టించాడు. కేబరే నర్తకి హొయలు కురిపించింది. వగలు చూపింది. వయ్యారం అందించింది. మూడొంతులు నగ్నంగావున్న ఆమె శరీరం అచ్చు రాత్రి ముకుందంగారి గదిలో చూసిన యువతి శరీరంలా కనిపించింది.

* * *

ఆరునెలల తరువాత ఒకరోజు.

జగపతి దగ్గర్నుండి ఒక వుత్తరం. కవరులో వుత్తరానికి జతగా నూటపాతిక రూపాయలకు క్రాస్‌చేసిన చెక్కు—

"...క్రిందటిసారి నువ్వు వాత్తేరొచ్చినప్పుడు పందెంలో ఓడిపోయావని నూటపాతిక రూపాయలు ఖర్చుపెట్టించాను. గుర్తుందికదూ? అది పొరపాటని ఈ మధ్యనే తెలిసింది. నిజానికి ఓడిపోయింది నేను. కనుక పందెం ప్రకారం ఖర్చు భరించవలసింది నేను. అందుకే నీ డబ్బు నీకు వాపస్ చెయ్యడం నా ధర్మం. జతపరచిన ఈ చెక్కుని స్వీక

రించు.. " అంటూ అర్ధంతరంగా ముగించాడు

"వీడి సస్పెన్సు తగలడ. " అనుకోబోతున్నాను. అంతలో పి. యస్. కనిపించింది.

"...వారం రోజుల్లో విజయవాడ వస్తున్నాము. మిగతా విషయాలు ముఖాముఖి మాట్లాడుకుందాం. ఓపికపట్టు..."

"స్కౌండ్రల్..." అనుకున్నాను కసిగా.

మళ్లీ మరొకసారి నా బుర్ర గందరగోళానికి గురయింది. జగపతి... ముకుందంగారి పడకగది... దయ్యంలో ముకుందంగారి కాపురం... సన్ఎన్సీ హోటల్...కేబరేనృత్యం మిస్ సలీమా హొయలు... నూటపాతిక రూపాయలు ...జగపతి చెక్కు...

"అయితే ఆమె ఎవరు ? ముకుందం గారు జగపతి అనుకున్నంత శ్రీరామ చంద్రుడు కాడన్నమాట ? అయితే అందమైన ఆడవాళ్లను రప్పించుకునే రహస్యమైన ఏర్పాటు వుందన్నమాట ? పూలిష్ జగపతీ" అనుకున్నాను. కసిగా జగపతి రాకకోసం ఎదురుచూశాను. పదిరోజుల తరువాత జగపతి వూడిపడ్డాడు. వస్తూనే "ఏంవాయ్ ? వెంకటేశం?" అన్నాడు గిరీశంలా నా పేరు వెంకటేశంకాదు

'నువ్వావిషయం చెప్పండే ఈ ఇంట్లో మంచినీళ్లుకూడా పుట్టవు.. " అన్నాను

"ఉరే ! నువ్వు విశాఖపట్నం వస్తే ఇలానే మర్యాదచేశానుట్రా ?"

"ముందా దయ్యంసంగతి చెప్పు."

"ఓస్ ! అదా ?..." అంటూ నాన్చి వెయ్యడానికి చూశాడు.

"ఆ వేషాలు నాదగ్గర కుదరవు. కానియ్..."

"ఇక్కడ చెప్పే విషయంకాదురా. ఇంట్లో అమ్మాయుంది ?"

"నీకాభయం అఖ్ఖర్లేదు ఈ ఇంట్లో ప్రస్తుతం ఆడపురుగులేదు."


"అయితే తప్పదన్నమాట. ముందు కాస్త కాఫీ అయినా తగలబెడతావా?"

ఫ్లాస్కులోవున్న కాఫీ కప్పులోపోసి యిచ్చాను. జగపతి చిన్న పోజుపెట్టి ఇలా అన్నాడు.

"ఈ మధ్య ప్రభుత్వానికి గుప్తధనం వెర్రొకటి పట్టుకుందిగా? అందులో ఒక భాగంగా ఒకరోజు సి బి. ఐ. వాళ్ళు ముకుందంగారి ఇంటిమీద మెరుపుదాడి జరిపారు.

దయ్యానికీ, సి బి.ఐ. వాళ్ళ మెరుపు దాడికీ ఏమిటి సంబంధమో నా కర్థం కాలేదు. వాడివంక కోపంగా చూశాను. వాడు గమనించలేదు.

" . వాళ్ళకు కావలసింది గుప్తధనం. నాకు తెలియని గుప్తధనం ముకుందం గారి దగ్గరెక్కడుంది? అందుకే మేము




పెద్దగాపట్టించుకోలేదు. సి బి ఐ వాళ్లతో ముకుందంగారు ఎగ్జంప్లరీగా సహకరించారు.

"చూడు జగపతీ? వీళ్ళకు కావలసిన రికార్డులన్నీ ఇచ్చెయ్యి అని నాకు బ్లాంక్ చెక్ ఇచ్చివేశారు.

"రికార్డులన్నీ వాళ్ళముందు పడేశాను. ఒక్క పైసాకూడా వ్యత్యాస కనిపించలేదు? అసలు వుంటేగా?

"ముకుందంగారూ? పైకి వెడదాం పదండి" అన్నారు ఆఫీసర్లు

"ఎందుకూ?" అన్నాడు ముకుందంగారు.

"అక్కడ కూడా సెర్చ్‌చెయ్యాలి?"

"నా ఆఫీసు ఇదేనండి! పైన నా రెసిడెన్సు" అన్నారు ముకుందంగారు అమాయకంగా.

"మా డ్యూటీ మమ్మల్ని చెయ్యనివ్వండి ప్లీజ్!"

"అని ముకుందంగారి జవాబుకు ఎదురుచూడకుండానే వాళ్ళు మెట్లువైపు నడిచారు. నేనూ ముకుందంగారు వెంబడించాం. ఇక్కడ కూడా ముకుందంగారు వాళ్ళతో సహకరించారు. బీరువా తరువాత బీరువా తాళంతీసి చూపెట్టారు. ఆఖరుకు బెడ్‌రూంలో అడుగుపెట్టాం...

"ముకుందంగారూ! ఆ బీరువాలు కూడా తెరిపించండి" అన్నాడొక ఆఫీసరు మర్యాదగా.

"క్షమించండి. వీటి తాళాలు కనిపించడం లేదు" అని నా వంకచూశారు.

"అయితే బీరువాలు పగలగొట్టాల్సొస్తుంది" హెచ్చరించారు.

"మీ యిష్టం"

సి. బి. ఐ. ఆఫీసర్లు గేస్‌కట్టర్ కోసం పురమాయించారు. కొంత వ్యవధి వుంది గనుక అంతా సోఫాల్లో కూర్చున్నారు. అప్పటి వరకూ కేర్‌ఫ్రీగా, హుందాగా వున్న ముకుందంగారి ముఖంలో మార్పు రావడం గమనించాను కొంపతీసి నాకు

తెలియని గుప్తధనం ఏమీ లేదుగదా అని పించింది. వెంటనే నా అనుమానం నాకే అగౌరవం అనిపించింది. ముకుందంగారు నన్ను పక్కగదిలోకి పిలిచారు. ముఖం చెమటతో తడిసిపోయివుంది. ఆందోళన వ్యక్తమవుతోంది.

"ఆ బీరువాలు పగలగొట్టకుండా చూడు. ఎంత ఖర్చయినా సరే.

"ఏమిటిసార్, వాటిల్లో ఏముంది?"

"నా పరువంతావుంది జగపతీ! వెళ్ళు! ఏదో ఒకటి చెయ్యి!...వ్యవధిలేదు..."

నేను వెళ్ళి వాళ్ళతో సంప్రదించాను. ఈ సోదాని అంతటితో ఆపమని ప్రాధేయపడ్డాను. ఖరీదు ఎంతయినా చెల్లించడానికి సిద్ధం అని వాళ్ళకు చెప్పాను. లక్షల్లో లంచం ఇవ్వడానికి సిద్ధపడ్డాను. కాని నేనుచేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ విషయం ముకుందం గారికి చెప్పాను. ముకుందంగారి ముఖం పాలిపోయింది. ఉరి తీయబడటానికి సిద్ధంగావున్నదా ముఖం...ఖూనీ తప్ప దని తెలుసుకున్నపుడు పడే ఆవేదన... సముద్రంలో మునిగిపోతున్నవాడి ఆరా టం...... ఆ ముఖంతో కనిపించాయి.

"అంతేనా? సరే..." అన్నారు మెల్లగా. జీవంలేనిగొంతు. ఇంతలో గేస్ కట్టింగ్‌పరికరా లొచ్చినవి. ఒక అధి కారి ఒక ఇనుప బీరువావైపు చూపె ట్టాడు. మిరుమిట్లు గొలుపుతూ గేస్ కటింగ్ మొదలయింది.

క్రింద నుండి పైకి లోహాన్ని చీరే స్తోంది. ఒక రెక్కతెగి దబ్బున క్రింద పడింది. గేస్ కటింగ్ మేస్త్రీ కెవ్వున కేకపెట్టి వెల్లికిలా పడ్డాడు.

దయ్యం...కాదు మనిషి...కాదు స్త్రీ ...కాదుకాదు...నిలువెత్తుని రబ్బరుస్త్రీ.

అక్కడ వున్నవాళ్లమంతా అదిరిపడి చూశారు.

చర్మంరంగు లేటెక్స్ రబ్బరుతో మెత్తటి ఇమిటేషన్ స్త్రీ. సర్వాంగసుంద రంగా వుంది. కులాసాగా గడుపుదామని ఆహ్వానిస్తున్నట్టుగా వొయ్యారాలు వొలక బోస్తోంది. బాతింగ్ అండర్‌వేర్ మినహా నగ్నంగావుంది.

"ఢాం... ఢాం..." ప్రక్కగదిలో ప్రేలుడు.

అంతా అటువైపు పరుగెత్తాము. లోపల గడియవేసివుంది. తలుపు బద్దలు చేసి లోనికి ప్రవేశించాము

ముకుందంగారు రక్తం మడుగులో చచ్చిపడి వున్నారు. పిస్తోలు పక్కనే పడివుంది. మెదడు చిందరవందరగా చెదిరిపోయి భయంకరంగా వుంది.

సి. బి. ఐ అధికార్లు సోదా పూర్తి చేశారు. మిగతా బీరువాల్లో కనిపించిన మరికొన్ని ఆసక్తికరమైన వస్తువుల జాబితా తయారుచేశారు.

1. ఒక ఎనిమిది మిల్లీమీటర్ల ప్రొజె క్టర్...

2. ఆరు బ్లూ (బూతు)ఫిల్ములు

3. నాలుగు కృత్రిమంగా కోరికతీర్చు కునే సెక్సు గాడ్జెట్‌లు

పీటన్నింటిమీదా డెన్మార్క్ ముద్రలు.